క్లుప్తంగా

18న బీఎంఎస్ కార్యాలయం ప్రారంభం

భూపాలపల్లి అర్బన్ : ఈ నెల 18న ఏరియా బీఎంఎస్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యతో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 50 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. సోమవారం వివిధ భూసంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పరామర్శ

మల్హర్ : మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన సమ్మక్క, కొయ్యూరుకు చెందిన వెంకటేశ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పరామర్శించారు. వారిచిత్ర పటాలకు పూలమాల వేసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జంగేడు ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ చిలువేరు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు మంచి అవకాశం అని, ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెగ్యులర్ విద్య పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారితో సమానంగా విద్య ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు, 9849397249, 9492443141 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సైబర్ క్రైంపై అవగాహన

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, మాదారం క్రాస్‌రోడ్డుల వద్ద స్థానిక పోలీసులు సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. ఓటీపీ, ఫోన్ పే, గూగుల్ పే పై ఇటీవల జరుగుతున్న నేరాలపై గురించి వివరించారు. కొత్త వ్యక్తులు ఫోన్‌చేసి మీకు లోన్ వస్తుందని లేదా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ వచ్చిందని పలువురికి ఫోన్లు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి ఫోన్లు ఎవరికైనా వస్తే స్పందించవద్దని యువకులకు, గ్రామస్తులకు సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మల్హర్: మండలంలో వల్లెకుంట గ్రామానికి చెందిన గడ్డం హర్షన్ మెడ సర్జరీ సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి ఆస్పత్రి సహాయకుడి ద్వారా హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–చెల్పూరు ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన గాండ్ల సూరజ్ (26) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై భూపాలపల్లి నుంచి పరకాల వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంఆర్ఎఫ్ షోరూం ఎదుట రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీని అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈఘటనలో తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

జిల్లా బెస్ట్ లైబ్రేరియన్‌గా చంద్రమౌళి



భూపాలపల్లి రూరల్: జిల్లా బెస్ట్ లైబ్రేరియన్‌గా జిల్లా గ్రంథాలయంలో పనిచేస్తున్న తుడుం చంద్రమౌళి ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ చంద్రమౌళికి అవార్డు అందించి అభినందించారు. చంద్రమౌళికి అవార్డు రావడం పట్ల జిల్లా గ్రంథాలయంలోని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

● రేగులగూడెంలో గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కాటారం: స్వచ్ఛదనం–పచ్చదనం పేరిట గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినప్పటికీ మురుగునీటి సమస్యలు మాత్రం ఎక్కడికక్కడే ఉండిపోయాయి. మండలంలోని రేగులగూడెంలో రోడ్లపై నిత్యం పారుతున్న మురుగునీటిని తొలగించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మురుగునీటిలో నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వారం రోజుల పాటు అధికారులు స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమం చేపట్టినప్పటికీ మురుగునీటి సమస్యను మాత్రం పరిష్కరించలేదని ఆరోపించారు. డ్రెయినేజీ నిర్మాణాలు సరిగా లేకపోవడంతో నిత్యం మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతుందని అన్నారు. కాలనీలవాసులు రోగాల బారిన పడుతున్న ట్లు పేర్కొన్నారు. అధికారులు మురుగునీటి నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంపీఓ వీరస్వామి గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. మురుగునీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు పనులు ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వాలు అందజేస్తున్న సుభాకర్‌రెడ్డి



మొగుళ్లపల్లిలో..

రేగొండ : ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సదాకర్ ఆధ్వర్యంలో కొత్తపల్లిగోరి మండలంలోని కొత్తపల్లిగోరి, చిన్నకోడెపాక ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని అన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భిక్షపతి, గిరిధర్ కృష్ణ, ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

మొగుళ్లపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లుల త్వరలో చెల్లింపులు జరుగుతాయని, త్వరలోనే మూడు డీఏలు మంజూరు అవుతాయన్నారు. 317 జీఓ బాధితుల సమస్యల పరిష్కారం, 2003 ఉపాధ్యాయులకి పాత పెన్షన్ సాధన, సీపీఎస్ రద్దు ప్రాథమిక పాఠశాలలో 10 వేల పీఎస్ హెచ్‌ఎంల మంజూరు, మోడల్ స్కూల్ టీచర్ల 317 అమలు, 010 పద్దు ద్వారా వేతనాలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్, ఐఈఆర్‌పీ, ఎస్ఎస్ఏ సమస్యల పరిష్కారం, పాఠశాలల మౌలిక వసతుల కల్పన తదితర ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణరెడ్డి, సాంబయ్య, ఎ.చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్ ఏఈఈలను సన్మానించిన ఎమ్మెల్యే



భూపాలపల్లి రూరల్ : నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియామకమైన పీఆర్ ఏఈఈలను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సేవలను అందించాలని సూచించారు.

గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లు రాకపోవడంతో ఎస్ఎంసీ చైర్మన్ మూత ఐలయ్య జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం కొనసాగిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అందించిన ఫిర్యాదును జిల్లా విద్యాధికారికి అందించి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో బిల్లులు నిలిచిపోయాయని అందుకే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఐలయ్య తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



శిరీష మృతదేహం

మహాముత్తారం: కుటుంబ సమస్యలు, అనారోగ్య కారణాలతో మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొర్లకుంటకు చెందిన లెక్కల శిరీష(28)కు గత మూడేళ్ల క్రితం పెద్దపల్లి జిల్లా తుర్కమద్దికుంట గ్రామానికి చెందిన వెంకటేశంతో వివాహం జరిగింది. భర్త వెంకటేశం భార్యపై అనుమానంతో రెండేళ్ల క్రితం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అప్పటి నుంచి శిరీష మండలంలోని కొర్లకుంటలోని తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. శిరీషకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా అనారోగ్యంతో ఉండటంతో ఆస్పత్రులకు సైతం తిరుగుతూ ఉంటుంది. ఈమధ్య కాలం నుంచి శిరీషకూడా అనారోగ్యం బారిన పడటంతో గత కొద్ది రోజుల నుంచి ఇంట్లోనే మానసికంగా ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి సర్వ రాజబాబు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆర్‌ఎంపీ..



ప్రభాకర్ (ఫైల్)

చిట్యాల: కడుపునొప్పి భరించలేక ఆర్‌ఎంపీ వైద్యుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జూకల్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్‌కు చెందిన బండారి ప్రభాకర్ (41) జూకల్‌లో ప్రథమ చికిత్స(ఆర్‌ఎంపీగా) అందిస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో అదివారం కడుపునొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందుతాగానని ఇంట్లోని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమారై ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

భూపాలపల్లి అర్బన్: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1936 సంవత్సరంలో ఏర్పడిన విద్యార్థి సంఘం స్వాతంత్ర సమయంలో విద్యార్థులను ఏకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, నాయకులు పోతుల పవన్, ఒద్దులే సాకేత్‌రెడ్డి, మహేందర్, రాధిక, చల్లూరి రక్షిత, గోలి లావణ్య, శరణ్య, రామ్‌చరణ్, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రేగొండ: సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేగుల సహదేవ్ అన్నారు. మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు సోమవారం మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవక సమగ్ర శిక్ష ఉద్యోగులు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వేల్పుల రఘుపతి, ఎంఐఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తౌటి నరేష్, మానస, రఘునాథ్, రాజమౌళి, రమేష్, స్వర్ణలత, అనసూయ, శైలజ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

రేగొండ: గ్రామపంచాయతీల్లో తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని మాజీ సర్పంచులు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పదవీ కాలంలో గ్రామాల్లో పంచాయతీ భవనాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, సీసీ రోడ్లు వంటి వాటిని అప్పులు చేసి నిర్మించామన్నారు. గత రెండేళ్లుగా బిల్లులు మంజురూ కాక అప్పుల పాలయ్యామన్నారు. దీంతో మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండిగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ సర్పంచ్‌లు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, లింగంపల్లి ప్రసాద్‌రావు, అంబాల చందు, భిక్య నాయక్, పబ్బ శ్రీనివాస్, సంతోష్, తిరుపతి, ఐలయ్య, సుధాకర్ ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్

చిట్యాల: వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లేశ్ మాట్లాడుతూ వర్షాకాలంలో మండలంలోని 25 గ్రామాల్లో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని కోరారు. అలాగే గ్రామాల్లో దోమల మందు పిచికారి చేయాలని, బ్లీచింగ్ పౌడర్‌ను నీరునిల్వ ఉన్న చోట చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పర్లపెల్లి శ్రీకాంత్, నాయకులు బోడ అరేందర్, విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని చలగరిగ, తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి దొంగతనాలు జరుగకుండా ఉంటాయన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానం అని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యాకయ్య, నవీన్, లింగన్న, సందీప్, నాగరాజు పాల్గొన్నారు.

కళాశాలలో 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయదేవి ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారత్ ప్రచారంలో భాగంగా అధ్యాపకులు సోమవారం విద్యార్థుల చేత 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ దేశానికి యువతే శక్తి సమాజమని, దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువత మదకద్రవ్యాలను పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, ప్రవీణ్, వెంకటరెడ్డి, కరుణాకర్, స్వరూప రాణి, నరేష్, రమేశ్, భరత్‌రెడ్డి, జైపాల్, రవి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మల్హర్‌రావు ఆశయాలు కొనసాగించాలి

● పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మధు

మల్హర్: మారుమూల ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం తపించిన బెల్లకొండ మల్హర్‌రావు చిరస్మరణీయుడని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి మాజీ జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మల్హర్‌రావు 74వ జయంతి సందర్భంగా సోమవారం కొయ్యూర్ సెంటర్‌లోని మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆనాడు సర్పంచ్‌గా మల్హర్‌రావు మండల అభివృద్ధికి బీజం వేశారని గుర్తుచేశారు. కొయ్యూరు నాగులమ్మ ఆలయం నుంచి తాడిచర్ల వరకు రోడ్డు నిర్మాణం కోసం అధికారులను ఎదురించాడన్నారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన కొమురం భీంస్ఫూర్తితోనే మల్హర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, రామరావు, కల్పన, మండల యూత్ అధ్యక్షుడు హరీష్, యాదగిరిరావు, రాము, హరిప్రసాద్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కాల్వను శుభ్రం చేస్తున్న పంచాయితీ సిబ్బంది

మల్హర్: మండలంలోని కుంభంపల్లి గ్రామంలో డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు, చెత్తాచెదారాన్ని సిబ్బంది తొలగించి కాల్వలను శుభ్రం చేశారు. కుంభంపల్లిలో అధ్వానంగా డ్రెయినేజీ అని ఈనెల 11న ఆదివారం సాక్షిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు సోమవారం మండలంలోని కొండపేట గ్రామపంచాయతీ పరిధిలోని కుంభంపల్లిలో చెత్తాచెదారాన్ని తొలగించారు. కాల్వలో నీరు నిల్వకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయులను స్మరించుకునేందుకే 'హర్ ఘర్ తిరంగా'



మాట్లాడుతున్న జన్నె మొగిలి

భూపాలపల్లి రూరల్: దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి బీజేపీ ×హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించిందని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ ప్రభారీ జన్నె మొగిళి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మండల కోఆర్డినేటర్ విప్లవరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా మొగిళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రజలందరూ వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని, నిబద్ధతతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టు రవి, భూపాలపల్లి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కొమురయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరిశీలన



నీటిని పరిశీలిస్తున్న అధికారులు

మహాముత్తారం: జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ములుగుపల్లి గ్రామంలో సోమవారం నీటి ట్యాంకుల వద్ద అధికారులు నాణ్యతను పీహెచ్ లెవల్‌ను, నీటి పరిమాణంను అదేవిధంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల వద్ద నీటి క్లోరినేషన్ లెవల్‌ను పరిశీలించారు. పీహెచ్ లెవల్‌ను జలజీవన్ మిషన్ ప్రోగ్రాం తనిఖీ అధికారి సందీప్ పరిశీలించి గ్రామ ప్రజల నుంచి నీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి పాగె లక్ష్మి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



చిట్యాల : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు పూజారి సుదయ్య, అనిశెట్టి శైలజ, కొప్పూరి అనితలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీడ్కోలు పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇంతకాలం ఇక్కడ పని చేయడం చాలా సంతోషకరంగా ఉందని, విద్యార్థులు చక్కగా చదువుకోవాలని మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చిదిరాల సరోజన, ఉపాధ్యాయులు సదయ్య, భాస్కర్, శ్రీనివాస్, వందన, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతిలో బదిలీపై వెళ్తున్న గంగిశెట్టి వెంకటేశ్వర్లును సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం రమేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.